క్లుప్తంగా

హద్దు రాళ్లు వచ్చేశాయ్


రాళ్లను పరిశీలిస్తున్న సర్వేయరు, వీఆర్ఓలు

దొర్నిపాడు: మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష రీ సర్వేపనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం డబ్ల్యూ గోవిందిన్నెలో రీసర్వే పనులు తుదిదశకు చేరడంతో పొలం హద్దుల్లో పాతేందుకు శనివారం రాళ్లు వచ్చాయని తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. 2వేల రాళ్లు అవసరం ఉండగా 975 రాళ్లు వచ్చాయన్నారు. మిగిలినవి రావాల్సి ఉందన్నారు. గ్రామంలో 1,378 సర్వే నంబర్లు, 8,028.38 ఎకరాల పొలం ఉందన్నారు. సర్వేయర్ కార్తీక్ రెడ్డి, వీఆర్ఓ ప్రవీణ్ రాళ్లను పరిశీలించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భార్గవి

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన 104 వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ భార్గవి తెలిపారు. వివిధ రోగాలతో బాధపడుతున్న 116 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. ఆమె మాట్లాడుతూ శీతాకాలంలో చంటి బిడ్డలు, వృద్ధులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ఆస్తమా ఉన్నవాళ్లు కూడా చలి సమయంలో బయటకి రాకూడదన్నారు. చిన్నారులకు వెచ్చని దుస్తులు వేయించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్ఓ ఉషారాణి, ఏఎన్ఎం మరియమ్మ, ఆశా వర్కర్లు చంద్రకళ, కళావతి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న నరసింహులు

నంద్యాల(అర్బన్): ఉద్యోగులకు చెల్లించాల్సిన రెండేళ్ల సరెండర్‌లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నరసింహులు కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐఆర్ ప్రకటించి ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి డిజిటల్ కార్డు ద్వారా ఆసుపత్రిలకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల (న్యూటౌన్): జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్లు, బదిలీల్లో తమకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాలలో ప్రత్యేక హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పోస్టల్‌హెల్త్, ఎడ్యుకేషన్, సోషల్‌వెల్ఫేర్, పోలీసు, విద్యాశాఖల్లోని దివ్యాంగులు మస్తాన్‌వలి, జలీల్‌బాషా, గుర్రప్ప, సామేల్, నాగేశ్వరరావు, బాలఉశేని, సునీల్ పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణ బిల్లును ఆమోదించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చూడాలని ఎంవీఆర్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులి కొండన్న కోరారు. శనివారం పెద్దకొట్టాల గ్రామంలో సంఘం జిల్లా స్థాయి నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందితే ప్రభుత్వానికి రుణపడి ఉంటారని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు,బాలు, శేఖర్, రాజు,తమ్మన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వార్లకు ఆకుపూజ, కుంకుమార్చన, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు సోమన్న మహిళాసమాఖ్య కో కన్వీనర్ మున్నీ జిలానీ కోరారు. శనివారం పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17, 18, 19వ తేదీల్లో నంద్యాలలో మహిళల సమస్యలు పరిష్కారం కోసం చేపడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


రూపనగుడి సమీపంలో మిరప పంటలో అంతరసేద్యం చేస్తున్న రైతు


ఉయ్యాలవాడ సమీపంలో పచ్చగా శనగ పైరు

జోరుగా పంటల సాగు

- 6,815 హెక్టార్లలో పంటల సాగు
- ఇప్పటికే 6015 హెక్టార్లలో శనగ పంట వేసిన రైతులు
- మరో పదివేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- ఈనెల 15వ తేదీ వరకు రబీ సాగుకు అనుకూలం

ఉయ్యాలవాడ: ఈ ఏడాది రబీలో కోటి ఆశలతో అన్నదాతలు పంటల సాగుకు సిద్ధమయ్యారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా సెప్టెంబర్ చివరి వారంలో కురిసిన వర్షాలకు కొందరు, మిగిలిన వారిలో ఇంకొందరు రైతులు అక్టోబర్ 16వ తేదీ నుంచి పప్పుశనగ సాగు చేశారు. వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఈ నెల 5,7 తేదీల్లో 58.9 ఎం.ఎం, వర్షం కురిసింది. సాగైన వివిధ పంటలకు ఈ నెలలో రెండు రోజుల పాటు వర్షాలు కురవడంతో పైర్లు కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు పప్పు శనగ 6,015 హెక్టార్లలో, జొన్న, మినుము, కంది, మిరప, వేరుశనగ, పొగాకు, తదితర పంటలు 800 హెక్టార్లలో సాగు చేశారు. రబీ సీజన్‌కు ఈ నెల 15వ తేదీ వరకు సమయం ఉంది. పదునైన వర్షం కురవడంతో మరో 10 వేల హెక్టార్లలో పప్పు శనగ సాగయ్యే అవకాశముందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ శనివారం తెలిపారు.

అర్హులకే నేరుగా పథకాలు


గొట్లూరులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: అన్ని వర్గాల్లోని అర్హులైన వారికి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మద్దూరు సచివాలయ పరిధిలోని గొట్లూరు, కలుగొట్లపల్లె గ్రామాల్లో సర్పంచ్‌లు లక్కిరెడ్డి శ్రీలత, ఈదుల దస్తగిరిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి బుక్‌లెట్ అందజేసి వారు పొందిన సంక్షేమ పథకాల గురించి, చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నాయా, పథకాల అమలులో ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలని కోరారు. పలువురు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తేగా అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, జగదీశ్వర రెడ్డి ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమణారెడ్డి, స్వామిరెడ్డి, శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి,తులసిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎల్.నరసింహారెడ్డి, సురేష్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, జయరామ పెద్దయ్య, దస్తగిరి, ఓ.వెంకటసుబ్బయ్య ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచురిస్తే చర్యలు

బొమ్మలసత్రం: దొంగను వదిలేశారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, ఇలా అవాస్తవాలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గత నెల 29న మతిస్థితిమితం సరిగా లేని వ్యక్తి కాలనీలో హల్‌చల్ సృష్టించాడు. స్థానికుల సమాచారం మేరకూ సీఐ నరసింహులు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చాలా మంది మతిస్థితిమితం లేని వ్యక్తులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచరిస్తున్నారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వివరాలు సేకరించి అతనిపై ఎలాంటి కేసులు లేనందున పోలీసులు వదిలేశారన్నారు. అధికారుల వివరణ లేకుండా ఇలాంటి వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించటం సరికాదన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో జరగనున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ప్రతి విద్యార్థి కళాశాల వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1969లో కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న వివరాల ద్వారా సమావేశ వివరాలు తెలియజేస్తామన్నారు. వివరాలను **https://gdcnandyal.ac,in/alumregform.php** లో నమోదు చేసుకో వాలని కోరారు. వివరాలకు కే.శ్రీనివాసులు సెల్ 9866418418, శివకుమార్‌రెడ్డి – 940878658 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుందాం

నంద్యాల(న్యూటౌన్): విప్లవంలో అశువులుబాసిన అమరవీరులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫి సూచించారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తూ ప్రాణాలు త్యాగం చేసిన అమర వీరుల సంస్మరణ సభలకు విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల హక్కుల కోసం 50సంవత్సరాలుగా పీడీఎస్‌యూ పోరాటం చేస్తుందని చెప్పారు. నాయకులు షాహిద్, బాలజీ, నాని, శంకర్, జఫ్నార్, రవి, రసూల్, విష్ణు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

శిరివెళ్ల: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన శ్రీరాములగారి అంకన్న (65) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ సురేష్ శనివారం తెలిపారు. మృతుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన ఇంటి దూలానికి పంచెతో ఉరేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక శనివారం మృతి చెందాడన్నారు. కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

యువకుడికి పాముకాటు

దొర్నిపాడు: మండల కేంద్రానికి చెందిన అశోక్ అనే యువకుడు పొలంలో కాడెద్లతో సేద్యం పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి వెళ్లగా వెంటనే డాక్టర్ నాగేంద్ర చికిత్స చేశారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ వైద్యశాలలో పాముకాటుకు సబంధించిన ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

మహానందీశ్వరస్వామి సన్నిధిలో..


దర్శనం అనంతరం జడ్జి జయలక్ష్మి, సునీల్ దంపతులు

మహానంది: కదిరి జూనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మీ సునీల్ దంపతులు శనివారం మహానంది వచ్చారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామివారి దర్శనార్థం వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అనంతరం వారికి స్థానిక యాగశాలలో స్వామి,అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

మల్లన్నను దర్శించుకున్న కర్ణాటక డిప్యూటీ సీఎం


కర్ణాటక డిప్యూటీ సీఎంకు స్వామివార్ల జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను కర్ణాటక డిప్యూటీ చీఫ్‌మినిస్టర్ డీకే శివకుమార్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా ధర్మకర్తల మండలి చైర్మన్, ఈఓలు స్వామిఅమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి


మౌలానా చిత్రపటానికి పూలమాల వేస్తున్న మురసం సభ్యులు


నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ముస్లిం రచయితల సంఘం (మురసం)ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మురసం జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ రఫీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, అనంతరం తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యారంగానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అంతకు ముందు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ఉపాధ్యక్షులు అబ్దుల్ సమద్, రఫిక్, మునీర్ పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మస్తాన్, రఫీ,జాను, వాసు పాల్గొని అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

నంద్యాలటౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యాప్తికి కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ సుధాకర్‌రెడ్డి, నాగరాజు, జోన్ చైర్మన్ చంద్రమోహన్, రమణయ్య, లాలిస్వామి పాల్గొన్నారు.

యోగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భరతమాత గుడి వీధిలోనున్న యోగా చైతన్య కేంద్రం, శ్రీరావర్తి రామఅకాడమీ ఆఫ్ యోగిక్ సైన్సెస్‌లో యోగాలో పీజీ డిప్లొమా పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శనివారం డైరెక్టర్ దామోదర రెడ్డి ఆధ్వర్యంలో కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ అకాడమీ ద్వారా 200 మంది యోగాలో పీజీ డిప్లొమా పూర్తి చేశారని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవన శైలిలో భాగంగా చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని అభిలశించారు. ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి, జగన్‌మోహన్ రెడ్డి, ప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు.


అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కొలనుభారతిలో 14 నుంచి కార్తీక పూజలు

కొత్తపల్లి: మండలంలోని సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతి ఆలయంలో ఈనెల 14 నుంచి కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మోహన్, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ శనివారం తెలిపారు. ఆలయంలో నెల రోజుల పాటు కార్తీకమాస పూజాకార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీకమాసం శివుడికి ప్రీతికరమైనది కావున సప్తశివాలయాల్లో అభిషేకాలు, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు చేపడతామన్నారు. భక్తులకు ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ సుభకుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం ఎస్సార్బీసీకి 1500 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. అలాగే ఎస్సార్బీసీకి ఈనెల 14వ తేదీ వరకు నీటిని అందిస్తామని చెప్పారు. వారబందీలో పద్ధతిలో మరో వారం లేదా పది రోజుల్లో నీటిని వదులుతామన్నారు. ఎక్కడా నీరు వృథా కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రైతులకు అండగా ఉంటున్నాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలకు నిత్యం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసీకీ 1100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారని, 17వ తేదీ వరకు వంతులవారీగా సాగునీరు వస్తుందని, తప్పనిసరిగా 27వ లాక్ వరకు నీరు పారుతుందని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఉన్న నీటి వనరులన్నింటినీ ఉపయోగించుకుంటూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. ముఖ్యంగా ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు వెంటనే కింద రైతులను దృష్టిలో ఉంచుకొని నీటిని వదలాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతుందని, దేవుడి దయతో వర్షం కురిస్తే రైతులు మరింత సంతోషిస్తారన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వర్షాలు, సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా ఏనాడు రైతుల కోసం గట్లపైకి రాని వారు ప్రస్తుతం కాల్వల పైకి వచ్చి ప్రభుత్వాన్ని విమర్శించడం భావ్యమేనా అంటూ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, భూసార పరీక్షల నుంచి దిగుబడుల విక్రయాల వరకు అన్నదాతకు అడుగడునా అంటున్నామనేది జగమెరిగిన సత్యమని, ఈ విషయాన్ని ఏ రైతును అడిగినా చెబుతారన్నారు. ఈ ఏడాది వర్షాలు లేక నీటి విడుదలలో జాప్యం జరిగిందని, అయినా ఒక్క ఎకరా ఎండటానికి వీలు లేదని నీటిని విడుదల చేయించామని, తమ చిత్తశుద్ధిని మీరా ప్రశ్నించేది అని మండిపడ్డారు. ఏ అంశాన్నైనా రాజకీయంగా వాడుకోవడానికి యత్నించడం మీకే చెల్లిందన్నారు. 2008–2009లో తెలుగుగంగ ఆధురీకరణ పనులు ఆగిపోయాయని, ఆ తర్వాత 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న మీరు ఎందుకు పనులను పునరుద్ధరించ లేకపోయారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాకా రూ.25కోట్లతో పనులు చేపట్టి తెలుగుగంగ రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తున్నామని చెప్పారు. ఎవరి మాటలో విని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకు సాగునీరిచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని గుర్తుచేశారు.

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి


రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూ తెలుగు వైభవాన్ని చాటడమే సాహితీ స్రవంతి ధ్యేయమని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో విద్య–సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి సాహితీ స్రవంతి నిరంత కృషి చేస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, వ్యాస, కవిత, కథా రచన పోటీలు నిర్వహించడం వల్ల తెలుగుభాషపై పిల్లలకు అభిరుచి కలిగేలా ప్రోత్సహించవచ్చన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం వల్ల బోధించిన అంశాలను పిల్లలు సులభంగా గుర్తుంచుకోగలుగుతారని చెప్పారు. నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులుగా అన్నెం శ్రీనివాస రెడ్డి, మాదాల శ్రీనివాసులు, మణిశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నీలం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా శేషఫణి, మహబూబ్‌బాషా, సరస్వతి కమిటీ సభ్యులుగా నీలకంఠ పరమాచారి, నరేంద్ర,రామచంద్రమూర్తి తదితరులను ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణను సన్మానించారు.

దుకాణాల ఏర్పాటుపై రాజకీయ ఆరోపణలు తగదు


మాట్లాడుతున్న మణికంఠ

నంద్యాల(సిటీ): దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసిన దుకాణాలపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని ది రిటైల్ క్రాకర్స్ అసోసియేషన్ నంద్యాల అధ్యక్షుడు తిరివీధి మణికంఠ, అసోసియేషన్ సలహాదారుడు ప్రదీప్ రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పార్టీల సమన్వయంతో కొన్ని సంవత్సరాల క్రితమే అసోసియేషన్ ఏర్పాటు చేశామని, అయితే కేవలం వైఎస్సార్‌సీపీపై పని కట్టుకొని నిందలు వేయడం అర్థరహితమన్నారు. అసోసియేషన్‌లో అన్ని రాజకీయపార్టీల నాయకులు సభ్యులుగా ఉంటే కొన్ని పత్రికలు అధికార పార్టీ నాయకులకు ఆపాదించి దుష్ప్రచారం సమంజసం కాదన్నారు. అన్నిసార్యాలతో దుకాణాలు ఏర్పాటుకు అధికారుల అనుమతులు పొందామని, నిరాధారమైన వార్తలు ప్రచురించిన వారిపై పరువునష్టం దావా వేయనున్నట్లు తెలిపారు. సభ్యులు నరేష్, వంశీ, ఆనంద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

జోరుగా ప్రజాభిప్రాయ సేకరణ


శిరివెళ్లలో ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శిరివెళ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలతీరుపై వైఎస్సార్‌సీపీ ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సర్వే ముమ్మరంగా సాగుతోంది. నవరత్నాలు, ఇతర పథకాలు అందాయా అని ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేస్తున్నారు. అలాగే టీడీపీ పాలనలో పథకాల అమలు, విధానాలు, ప్రస్తుతం అమలవుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. సర్వేలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఏంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, సర్పంచు సాలమ్మ, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొంటున్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా


చాకరాజువేములలో ప్రభుత్వ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా లభించిందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ' వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరిగి టీడీపీ హయాంలో పాలన, పథకాల అమలు, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న పనులకు సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు శివారెడ్డి, మోహన్‌నాయుడు, వాసుడు, సుబ్బయ్య, మైనుద్దీన్ యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నంద్యాల(న్యూటౌన్): కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హిదాయతుల్లా కోరా రు. శనివారం స్థానిక చిన్మయమిషన్ స్కూల్ లో సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేష న్ ప్రకారం కొన్ని శాఖల్లోని ఉద్యోగులను మాత్రమే క్రమబద్ధీకరిస్తూ విడుదల చేసిందన్నారు. ప్రభు త్వం అన్ని శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తీర్మానించారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంట్రాక్టు ఎంఐఎస్ కో ఆర్డినేటర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నా రు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా హిదాయతుల్లా, ఉపాధ్యక్షులుగా సరస్వతి, సెక్రటరీగా తిరుపతయ్య, జాయింట్ సెక్రటరీ రాజేశ్వరి, ట్రెజరర్‌గా సుబ్బరాయుడును ఎన్నుకున్నట్లు చెప్పారు.